# గాంధీ ది గ్రేట్ |

మావారిని నైతికంగా ఆధ్యాత్మికంగా ఎంత అభివృద్ధిలోకి తీసుకొద్దామన్నా నాతరం కాకుండా వుంది. గాంధీగారు నిజంతో ఎన్ని ఎక్స్‌పెరిమెంట్లు చేశారో మావారు అబద్ధంతో అన్ని ఎక్స్‌పెరిమెంట్లు చేశారు. అయన గొడవంతా ఒక పుస్తకం రాస్తే అదో గొప్ప "అన్‌టోల్డ్ స్టోరీ" అవుతుంది.

వినవే శర్వాణీ - చిన్నప్పుడు నాకో గరల్ ఫ్రండుండేది. దాని పేరు వెంకట వరాహ సత్యవతి. దాన్ని సత్యం అని ముద్దుగా పిలిచే వాళ్ళం. ఆ సత్యం అనే పిల్లతో మై ఎక్స్ పెరిమెంట్సు విత్ ట్రూత్ చెబుతా వినవే అలికులా వేణీ వరనుత కల్యాణీ" అంటూ అధ్యాత్మ రామాయణం ధోరణిలో పడ్డారు. నాకు చిరాకేసి స్టాపండి దట్ నాన్సెన్స్. గాంధీగారి గురించి నేను మాట్లాడుతూంటే వెంకట వరాహ సత్యవతి గురించి మీరెందుకు మాట్లాడ్డం అని గసిరేశాను కోపంగా.

"ఈ వాళెందుకే యాంగ్రీగా వున్నావు పిల్లా" అన్నారు. పిల్లా లేదు. పీచూలేదు. మీరింకా ఆ వెంకటవరాహసత్యవతి తన్మయత్వం లోనే వున్నట్లున్నారు. కమింగ్ టు ది పాయింటు— గాంధీగార్లా ధైర్యంగా వుండాలిగాని ట్రూత్ అంటే మీకెందుకండీ అంతపెద్దభయం, కంగారూ— అంటే అబ్బే— లేదే నాకెందుకు కంగారు. నేనుకూడా బోల్డు ఫెలోని. ఐ లైక్ గాంధీ— ఏవే స్వీట్ చకోరీ! బోడిగుండు ఆయన చేయించుకుంటె బావుందికాని మనం (అంటే నేను) గుండు చేయించుకుంటే బావుంటుందే ?హౌ డు యు లైక్ నేను గాంధీలా వేషం వేస్తే.... అన్నారు.

మీరెందుకు గాంధీలా వేషం వేయడం. వేసేవాళ్లు దేశంనిండా కొల్లలుగా వున్నారు. ఏవేఁ మై చాకలెట్.... గాంధీమహాత్మా రైటా. మహాత్మాగాంధి రైటా? నాకన్నీ డవుట్సేనే.

"నాకూ వేరుశెనక్కాయలిష్టం బట్ గోట్స్ మిల్కు ఐ కాంట్ శ్వాలో.... ఇవాళ గాంధీగారి పుట్టింరోజు కాబోలు. బొబ్బట్లూ, పులిహోరాచేసుకుందావా లేకపోతే మామూలుగా ట్రూత్‌తో ఎక్స్‌పెరిమెంట్లు చేద్దావా!" అన్నారు వారు. గాంధీగారికి చాలా యిష్టం యీవేళ ఉపవాసం వుందామండీ వుయ్ టూ అన్నా. ఉపవాసమే.... వనవాసం చేయమన్నా చేస్తానుకాని, ఉపవాసం నే చేయలేనే అని పప్పులో గరిటలా జారుకున్నారు. ఎ. సి. లో డిన్నరుచేసి కాసినోవా 70కి వెళ్దాం పదమన్నారు. దిక్కుమాలిన సినిమా నాకు డోకొస్తుందండి అన్నా. అయితే నువ్వు గాంధీగార్ని థింక్ చేస్తూ కూర్చో, నేనల్లా వెళ్ళి "ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్" సాగించొస్తాను. అని వీథిలో పడ్డారు. గో టు హెల్ అన్నాను. ఇంకేవనాలి?

టాగోర్‌కి, లెనిన్‌కి, టాల్‌స్టాయికి, షాకి వున్నట్లు గాంధీగారికి గడ్డంలేదు. గాంధీగారికే గడ్డం వుంటే ఆయన బోసినోరిప్పితే ముత్యాల తొలకరే అనేటువంటి చిరునవ్వు అంతబాగా పాప్యులర్ అయేదికాదు. ఆయన గడ్డంలేని మహాత్ముడు. గాంధీ ఈజ్ నో గ్రేట్ జీనియస్. ఆయనేవన్నా ఏబ్రిలింకనా, లియోటాల్‌స్టాయా, టాగోర్లా కవా? సైగల్లా గాయకుడా, సర్ సీవి రామన్లా సైంటిస్టా, మహామేధావా, ఆఫ్టరాల్ ఏ నేకెడ్ ఫకీర్ — దరిద్రనారాయణ్ — సో ఆయన గొప్పేవిటి? ఆయన మాచెడ్డ మొండివాడు. మొండివాడు బ్రిటిష్‌రాజుకన్నా బలవంతుడు అని కనిపెట్టి రుజువు చేసిందీయనే! ఆయనపట్ల అమితమైన రెస్పెక్టు చేత బొమ్మలకొలువులో ఆయన విగ్రహాన్నిపెట్టి "గాంధీమహాత్మునికి జయ మంగళం నిత్యశుభమంగళం" అని మంగళారతులు పాడేరు మన మహిళలు. ఇప్పుడు అడగండి ఈ గాంధీభక్తుల్ని గాంధీ సమాధికి, గాంధీ

దేవాలయానికి వున్న తేడా— దే డోంట్నో! గాంధీ విగ్రహారాధకులకు ఆయన చెప్పినది, చేయమన్నది ముఖ్యంకాదు. ఆయన చెప్పులజోడూ, తినే చిప్పా— చెంచా— చేతికర్ర యివే ముఖ్యం. మెళ్ళోకట్టుకు మోగించడానికి ఓ డప్పుండాలి. కొన్నాళ్ళు టాగోర్ డబ్బాపట్టుకు తిరిగి టాగోర్ పేరుచెబితే జనానికి వాంతిపుట్టేట్లు మనవాళ్ళు డప్పుకొట్టేశారు, ఇప్పుడు గాంధీ డబ్బాపుచ్చుకు బయల్దేరారు. "పరమపూజ్య బాపూజీ— అహింసాజ్యోతి" అంటూ పేరుచెప్పుకుని మంటపాలు. స్తూపాలు, హరికథలూ, బుర్రకథలూ, చక్కాభజనలూ మొదలెట్టి, పైకి మోడ్రన్సుమని చెప్పుకుంటూ లోపల డర్టీ సెంటిమెంటల్ బిజినెస్సంతా సాగిస్తున్నారు. పూర్వం అల్లావాడెవడో దేవాలయాలు పడకొట్టి మసీదులు కట్టాడ్ట. ఇప్పుడు మనవాళ్లు ప్రజలను పడకొట్టి అనుగ్రహారాధన విగ్రహారాధన జోరుగా సాగించేస్తున్నారు. ఇహ మన కంట్రీకి మోక్షం లేదని మనవే రుజూచేసి చూపించడానికి కంకణం కట్టుకున్నాం. దట్సాల్ రైట్.

మా ఊళ్ళో కొంతమంది అపరిమితమైన భక్తితో గాంధీగారిని గ్రాంధీగార నేవారు. వీరికంటె అధికులు ఎచ్చు రెస్పెక్టు కలవారు "గంధి" అనేవారు. వాళ్ళ అమ్మగారు ఎంచక్క "మోహన్‌దాస్" అని ముచ్చటగా పేరు పెట్టుకుంటె అదొదిలేసి మనవాళ్ళు "గంధి" (గ్రాంధి) అని వెంటపడ్డారు. శ్రీ ప్రభుత్వంవారూ నాయకులూ కలిసి, జనం నెత్తిమీద పెకుతున్న (నిష్) కళంకమైన గాంధీటోపీని కనిపెట్టిన దీయనే. తన భక్తులే తన పరువుతీస్తారని ఆయనకు తెలీదా— తెలుసు. ఏ కులమత విభేదాలు సమసిపోవాలని ఆయన తహతహ లాడేడో, వాటి ప్రాతిపదికమీదే తన శిష్యులు రాజ్యం చేస్తారనికూడా ఆయనకు తెలుసు.

గాంధీ అంటేగడుసుతనం ప్లస్ మొండితనం— స్వరాజ్యంరావాలి కనుక దానికోసం, ఏ టెక్నిక్ అవసరమైతే దాన్ని నిర్మొహమాటంగా అవలంబించినవాడు గాంధీ ది గ్రేట్. గాంధీజీ టెక్నిక్‌ను పిడుక్కూ బియ్యానికి ఒకటేమంత్రంగా వాడాల్సినకర్మ మనకేంపట్టలేదు. రాట్నం

విష్ణుచక్రంతో సమానమన్నారు. కాని రాట్నం వడికితే వచ్చేనూలుతో యిన్నికోట్ల ప్రజలకు గుడ్డ లభ్యమవుతుందా? గాంధీగారు తెలిసేపరమయిండి కనుక యంత్రయుగాన్ని నాగరికతను వ్యతిరేకించాడు. ఆయన పేదరికాన్ని సహజమైన కర్మగా తీర్చిదిద్దాడు. దారిద్ర్యాన్ని సహించి భరిస్తూ తిరగబడకుండా సహనం నేర్చుకోమన్నారు. అంతగా అవసరమైతే కలవారిమీద అలగడం మంచిదన్నాడు. ఆడవాళ్లు యింట్లో అలిగి సహాయనిరాకరణంచేసి వాళ్ళకు కావలసినవి సాధించుకోడంలేదా. అవే సింపుల్ డొమెస్టిక్ థీరిస్‌ని నేషన్‌కి అప్లయిచేశాడు. ఇంగ్లీషుచదువులు మానమన్నాడు. విదేశీబట్ట కట్టవద్దన్నాడు, హిందీ రాష్ట్రభాష అన్నాడు. అప్పుడు గంగిరెద్దులా తల్లూపి యిప్పుడు హిందీవద్దు మొర్రో అని రైళ్ల పడగొడితే ఏం లాభం? ఇంగ్లీషుచదువులు వద్దనడం, బళ్లుఎగకొట్టమని పిల్లలకు చెప్పడం ఆయన చేశాడు గనుక సరిపోయిందికాని, మరోడూ మరోడూ ఆ పనిచేస్తే నవ్వులపాలయేవారు. విదేశీవస్తు బహిష్కరణోద్యమం యిప్పుడు తల్చుకుంటే ఎంత నాన్సెన్సికల్— కాని అది గాంధీగారు చేయించినందున అప్పుడది ఒక అస్త్రమై శస్త్రమైకూర్చుంది. అక్కడే మహాత్మా చేసిన ఎక్స్‌పెరిమెంట్స్‌కీ మావారు సత్యంతో చేసిన ఎక్స్‌పెరిమెంట్స్‌కీ తేడా.

డొమెస్టిక్ సింపుల్ థీరీస్‌ని నేషనల్‌కాజుకి అప్లయిచేసే ధైర్యం కల మొనగాడెవరే అంటే— గాంధీ నో డవుట్! ఆయన ఎక్స్‌పెరిమెంట్లతో ప్రపంచాన్ని ఫూల్ చేయలేదుకదా—ఏమో— నామటుకునాకు ఆయన ఎక్కడ పుట్టాడన్నది ఇంపార్టెంటుకాదు. ఆయన ఏంచేశాడన్నది ఇంపార్టెంటు. ఆయన ఎవరికి పుట్టాడన్నది కాదు, నోట్ చేయవలసినది. ఆయన ఎవరిని ఉద్ధరించాడన్నది నోట్‌చేయాలి. ఆయన ఏంతిన్నాడు ఏంకట్టుకున్నాడు, జాబితాలు లిస్టులు యివికాదు జ్ఞాపకంపెట్టుకోవలసినవి, ఆయన మనల్ని ఏంచేయమన్నాడో జ్ఞాపకంపెట్టుకుంటే చాలు!

గాంధీ గురించి మనకు బాగా తెలుసు అనుకునేవారికో వార్నింగ్. ఆయన గురించి ఆలోచించినకొద్దీ ఆయన ఒక అపరిష్కృత మహాకావ్యం— ఒక బిగ్ క్వశ్చన్‌మార్క్— ! ఆయన గురించి వ్యతిరేకంగా ఆలోచించడం మొదలెడితే కాని ఆయన మనకి అర్థంకాడు. గాంధీ ది గ్రేట్ లెటజ్ థింక్ ఎబవుట్ హిం. వస్తా, పిల్లొచ్చిందండి కిటికీలోంచిదూకి పాలుతిరగదోస్తుందేమో కర్మ! ఇప్పుడు మావారు ఏ గాంధీకొండమీదో ఖద్దరు బుష్‌షర్టు వేసుకుని కాసినోవా 70 గురించో, ఎ. సి.లో డిన్నరు గురించో ఆలోచిస్తూవుంటారు. ట్రూత్ అంటేమనకి చచ్చేటంతభయం! నంగిరి పింగిరిగా వంగివంగి దండాలెట్టమంటే మనవంతారెడీ— మనకు తెయనివి ఏవీ గాంధీగారు కొత్తగా కనిపెట్టి మనకు చెప్పలేదు.

"మట్టిబొమ్మలను మహారణానికి" అన్నట్లు ఆయన పప్పుసుద్ద లను ఆటంబాంబులుగా మార్చాడు. కాని మనది పప్పుసుద్దలుగా వుండిపోవడానికి, మట్టిముద్దలుగాను దిమ్మచెక్కలుగాను మిగిలిపోవడానికితీర్మానించుకున్న జాతికనుక, ఏంచేస్తాం గాంధీమంటపాలు కట్టుకోక ... ఇటీజ్ ది చీప్ వే ఆఫ్ ఆనరింగ్ ది గ్రేట్ గాంధీ!